teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 167 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 14 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## పోగు బంధంతో ఫోన్ బంధం

క్యూఆర్ కోడ్ శాలువా ఆవిష్కరించిన కేటీఆర్ నేతన్న నల్ల విజయ్ కుమార్ అద్భుత సృష్టి స్కాన్ చేస్తే తెలంగాణ చరిత్ర, పథకాల వివరాలు



.. వివరాలు 2లో



## రైల్వేలో కొలువుల జాతర

2026-27 జాబ్ క్యాలెండర్ విడుదల
లక్షకు పైగా ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్
టెన్త్ నుంచి పీజీ వరకు.. అందరికీ ఛాన్స్

.. వివరాలు 2లో



## అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

100 మంది వినియోగదారుల గుర్తింపు
ఒడిశా నుంచి సిటీకి అక్రమ రవాణా
5 కిలోల హాష్ ఆయిల్, గంజాయి సీజ్
సూత్రధారి సహా ఐదుగురిని అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్

.. వివరాలు 2లో



# న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు



### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- హెూటళ్లు, పబ్‌లకు సీపీ సజ్జనార్ మార్గదర్శకాలు
- రాత్రి 1 గంట వరకే అనుమతి
- డ్రగ్స్, అశ్లీలతపై ఉక్కుపాదం
- మందు బాబులను ఇంటికి చేర్చే బాధ్యత నిర్వాహకులదే
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్ష తప్పదు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్ పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31న జరిగే వేడుకలకు సంబంధించి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెూటళ్లు, క్లబ్బులు, పబ్‌ల నిర్వాహకులకు శనివారం కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

5

# బండి V/S ఈటల

## కమలం కోటలో వర్గపోరు

- హుజూరాబాద్‌లో ముదిరిన పంచాయతీ
- బండి, ఈటల అనుచరుల మధ్య టఫ్ ఫైట్
- బండి పీఆర్వో పోస్టులపై ఈటల సీరియస్
- పిచ్చోళ్ల పోస్టులు పట్టించుకోను.. ఈటల వార్నింగ్



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ బీజేపీలో బండి సంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్ పోరాటం మరో మలుపు తిరుగుతోంది. పంచాయతీ ఎన్నికల సందర్భంగా హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ తరపున అభ్యర్థులుగా ఖరారు చేసే వ్యవహారంలో ప్రారంభమైన వివాదాలు అంతకంతకూ పెద్దవి అవుతున్నాయి. బండి సంజయ్

మిగతా 2 లో

# నక్సలిజం

## విషపూరిత పాము

- 2026 ఆగస్టు నాటికి అంతం: అమిత్ షా
- బస్తర్ ఒలింపిక్స్ వేదికగా హెూం మంత్రి కీలక వ్యాఖ్యలు



02




### ములుగు జిల్లాలో

# మూడేళ్లుగా నిర్దోషి నరకయాతన..?

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసా..!
నిజం నిరూపించే వీడియో సాక్ష్యం లభ్యం
న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన ఓ వ్యక్తి

02





చిర్ర రజినీకాంత్

మార్చి 03, 2022 లో జరిగిన సంఘటనలోని వీడియోలో ఇది ఓ దృశ్యం, బాణం గుర్తు ఉన్న వ్యక్తి చిర్ర రజినీకాంత్, మిగతావారు కూడా దరఖాస్తుదారులే.. మహిళ చూపిస్తున్న పత్రాలు దరఖాస్తుదారులకు తెలియకుండా రహస్యంగా ఎంపీడీఓ కార్యాలయానికి కార్యదర్శి తెచ్చిన ధ్రువీకరించిన డాక్యుమెంట్స్..

# ఫామ్‌హౌస్ కోసమే RRR అలైన్‌మెంట్ మార్పు..?

## హరీశ్ రావుపై కవిత సంచలనం

- రెడ్డిపల్లి టు తుంకి.. 400 ఎకరాల దందా
- ఫైవ్ స్టార్ రిసార్ట్ కూడా ఉందంటూ ఆరోపణలు
- జిల్లా పర్యటనలో మాజీ మంత్రిపై కవిత ఫైర్
- నెట్టింట వైరల్ అవుతున్న వీడియో



02

# సీబీఎస్ఈ టెన్త్ ఎగ్జామ్స్ ప్యాటర్న్ చేంజ్

- సైన్స్, సోషల్ పేపర్లలో కీలక మార్పులు
- 2026 బోర్డు పరీక్షల నుంచి కొత్త విధానం
- మూల్యాంకనంలో తప్పులకు చెక్
- పాఠశాలలకు బోర్డు ఆదేశాలు




02




# ఎన్నికల వేళ పగతో రగిలిపోయిన కొత్తపల్లిపల్లె

ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి పెదనాన్న వీరంగం
ఓ వ్యక్తిపై కత్తితో దాడికి యత్నం
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉద్రిక్తత
పిడిగుద్దులతో దాడి.. గాయల పాలైన శివరావు
కక్షతో.. కత్తితో వెంటపడగా అడ్డుకున్న స్థానికులు
పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తుల మూకుమ్మడి ఫిర్యాదు



ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు పల్లెల్లో ఇంకా సెగలు రేపుతూనే ఉన్నాయి. తమకు ఓటు వేయలేదన్న అక్కసుతో, తమకు సపోర్ట్ చేయలేదన్న కక్షతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి పెదనాన్న, ఓ వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపింది.




# ఎన్నికల వేళ పగతో రగిలిపోయిన కొత్తపల్లి పల్లె

ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి పెదనాన్న వీరంగం

ఓ వ్యక్తిపై కత్తితో దాడికి యత్నం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉద్రిక్తత

పిడిగుద్దులతో దాడి.. గాయల పాలైన శివరావు

కక్షతో.. కత్తితో వెంటపడగా అడ్డుకున్న స్థానికులు

పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తుల మూకుమ్మడి ఫిర్యాదు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్ డెస్క్): ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు పల్లెల్లో ఇంకా సెగలు రేపుతూనే ఉన్నాయి. తమకు ఓటు వేయలేదన్న అక్కసుతో, తమకు సపోర్ట్ చేయలేదన్న కక్షతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి పెదనాన్న, ఓ వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపింది. ఘటన వివరాలు పరిశీలిస్తే.. గోరుకొత్తపల్లి మండలం, కొత్తపల్లి (కె) గ్రామానికి చెందిన బోరగాని శివరావు అనే రైతుపై, అదే గ్రామానికి చెందిన మాదాసు సంజీవరావు దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిసెంబర్ 12న రాత్రి 7 గంటల సమయంలో శివరావు ఇంటి వద్దకు మాదాసు సంజీవరావు బైక్ పై వచ్చి పిలువగా ఇంట్లోనుండి బయటకు వస్తే సంజీవరావు బూతులు తిడుతూ నా తమ్ముని కొడుకు సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోవడానికి నువ్వే కారణం, మాకు ఓటు వేయలేదు, మాకు సపోర్ట్ చేయలేదు అని దూషిస్తూ శివరావు ఎడమ కనుబొమ్మపై పిడిగుద్దులు గుద్దాడు. అక్కడితో ఆగకుండా, కత్తి తీసుకొని వచ్చి చంపడానికి ప్రయత్నించగా.. స్థానికులు అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా శివరావు






గాయలపాలు అయ్యాడు. అనంతరం కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో శివరావు పిర్యాదు చేయగా ఎఫ్ఐ ఆర్ నమోదు అయినట్లు సమాచారం.

**మాకు ప్రాణహాని ఉంది : గ్రామస్తులు:**

ఈ ఘటనపై కొత్తపల్లి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎవరికి వేయాలనేది వ్యక్తిగత స్వేచ్ఛ అని, ఇలా భౌతిక దాడులకు దిగడం హేయమని పేర్కొన్నారు. ఈ మేరకు మాకు ప్రాణహాని ఉందని గ్రామస్తులు కొంతమంది ఏకమై సంతకాలు చేసి, నిందితుడు మాదాసు సంజీవరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తపల్లి (గోరి) ఎస్.హెచ్.ఓ కు వినతి పత్రం సమర్పించారు.

# ములుగు జిల్లాలో "మూడేళ్లుగా నిర్దోషి నరకయాతన..?"

## అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసా..!

### నిజం నిరూపించే వీడియో సాక్ష్యం లభ్యం

### న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన ఓ వ్యక్తి

ములుగు క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ప్రజాధనం పక్కదారి పడుతుంటే ప్రశ్నించడమే ఆ యువకుడు చేసిన నేరం. అర్హులైన పేదలకు దక్కాల్సిన రుణాలు అన్యాక్రాంతం అవుతుంటే ఉన్నత అధికారులకు పిర్యాదు చేయడమే అతను చేసిన పాపం. అవినీతిని ఎండగట్టినందుకు అక్రమ కేసులో ఇరికించి, మూడేళ్లుగా కోర్టు చుట్టూ తిప్పుతూ నరకం చూపించారు. చివరకు ఆనాటి ఘటనకు సంబంధించిన 'వీడియో సాక్ష్యం' ఆలస్యంగా వెలుగులోకి రావడంతో.. బాధితుడు ఇప్పుడు తనకు న్యాయం చేయాలంటూ ములుగు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు.

**అసలేం జరిగింది..**

ములుగు జిల్లా, మల్లంపల్లి మండలం (పాత ములుగు మండలం), రామచంద్రాపురం గ్రామానికి చెందిన చిర్ర రజనీకాంత్ (32) గిరిజన యువకుడు ఆర్టీఐ సామాజిక కార్యకర్త, 2020-21 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఎస్టీ కార్పొరేషన్ రుణాల మంజూరులో అవకతవకలు జరిగాయని రజనీకాంత్ మరియు మరికొందరు దరఖాస్తుదారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉండగా.. గ్రామ కార్యదర్శి తనకు సన్నిహితులైన వారి కోసం రహస్యంగా ధ్రువపత్రాలను సిద్ధం చేశారనే ఆరోపణలు రాగా... దరఖాస్తుదారులకు తెలియకుండానే నచ్చిన లేదా పలుకుబడి ఉన్నవారు సూచించిన వారి పేర్లతో తతంగం నడిపించడాన్ని రజనీకాంత్, మరికొందరు బాధితులతో కలిసి అప్పట్లో కలెక్టర్, ఎంపీడీవోల పిర్యాదు చేస్తూ దృష్టికి తీసుకెళ్లారు.



మార్చి 03, 2022 లో జరిగిన సంఘటనలోని వీడియోలో ఇది ఓ దృశ్యం, బాణం గుర్తు ఉన్న వ్యక్తి చిర్ర రజినీకాంత్, మిగతావారు కూడా దరఖాస్తుదారులే.. మహిళ చూపిస్తున్న పత్రాలు దరఖాస్తుదారులకు తెలియకుండా రహస్యంగా ఎంపీడీఓ కార్యాలయానికి కార్యదర్శి తెచ్చిన ధ్రువీకరించిన డాక్యుమెంట్స్..

**ఎంపీడీవో ఆఫీస్ వద్ద హైడ్రామా..**

ఈ అక్రమాలపై విచారణ కోరుతూ 2022, మార్చి 3న రజనీకాంత్ మరియు మరికొంతమంది దరఖాస్తుదారులు ములుగు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ గ్రామ కార్యదర్శి నేత కోటేశ్వర్ అనుకోకుండా కనిపించడంతో అతనిని నిలదీశారు. అయితే, ఉన్నత అధికారులకు చేసిన ఈ పిర్యాదుల ద్వారా తన తప్పు బయటపడుతుందనే భయంతో సదరు కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా, విషయాన్ని పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసి పక్కదారి పట్టించారని బాధితుడు ఆరోపిస్తున్నారు. తనపై దాడి చేశారంటూ, బెదిరించారంటు.. అక్కడ లేని తోటి కార్యదర్శులతో పోలీసులకు సాక్షం చెప్పించి




రజనీకాంత్ పై తప్పుడు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు రజినీకాంత్.

**కీలక మలుపు.. లభ్యమైన వీడియో**

గత మూడేళ్లుగా ఈ కేసు కారణంగా రజనీకాంత్ ఆర్థికంగా చితికిపోవడమే కాక, స్థానికుల దృష్టిలో తప్పుచేసినవాడిగా.. వారు చూసే విధానంతో మానసిక క్షోభ అనుభవించానని అన్నారు. అయితే, ఇటీవల.. ఆ రోజు ఎంపీడీవో ఆఫీస్ వద్ద జరిగిన వాస్తవ దృశ్యాలున్న వీడియో ఫుటేజ్ రజనీకాంత్ కు లభించింది.



"నేను ఎవరినీ కొట్టలేదు, అసభ్యంగా ప్రవర్తించలేదు, బెదిరించలేదు. ఆ వీడియోలో ఈ విషయం స్పష్టంగా ఉంది" అని రజనీకాంత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ములుగు ఎస్పీకి విజ్ఞప్తి**

తన నిర్దోషిత్వాన్ని నిరూపించే వీడియో సాక్ష్యాలు తన వద్ద ఉన్నట్లు, డిసెంబర్ 9న ములుగు జిల్లా ఎస్పీకి రజనీకాంత్ లిఖితపూర్వక ఫిర్యాదును (పోస్ట్ ద్వారా.. ఇది డిసెంబర్ 10న కార్యాలయానికి చేరింది) పంపారు. తనపై బనాయించిన అక్రమ కేసును కొట్టివేసి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై, అసత్య సాక్షులపై చర్యలు తీసుకోవాలని ఆయన వేడుకుంటున్నారు. మరి పోలీసులు ఈ నూతన సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# నక్సలిజం విషపూరిత పాము



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నక్సలిజం పాము లాంటిదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేసారు. శనివారం బస్తర్ ఒలంపిక్-2025 ముగింపు కార్యక్రమంలో అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్సలిజం ఎవరికీ ప్రయోజనం కలిగించదని, శాంతి మాత్రమే అభివృద్ధికి మార్గం చూపగలదని పేర్కొన్నారు. 2026 ఆగస్టు 31 నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తామని మరోసారి స్పష్టం చేసారు. నక్సలిజం విషపూరిత పాము లాంటిదని, దానిని పెంచి పోషించడం అంటే మన ప్రాణాలను హాని కలిగించుకోవడమేనని అన్నారు. వచ్చే ఏడాది కల్లా నక్సలిజాన్ని అంతం చేసి, దేశంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తామని తెలియజేసారు. కాగా ఆపరేషన్ కగార్ లో భాగంగా ఇప్పటికే వందల మంది మావోయిస్టులు హతం అయిన సంగతి తెలిసిందే.

# రైల్వేలో కొలువుల జాతర




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్ వచ్చింది. రైల్వేలో లక్షకు పైగా ఉద్యోగాల భర్తీకి తాజాగా రైల్వే డిపార్ట్‌మెంట్ అధికారికంగా 2026-27 రైల్వే జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. ఈ జాబ్ క్యాలెండర్ ద్వారా రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్, సెక్షన్ కంట్రోలర్, జూనియర్ ఇంజనీర్, పారామెడికల్ క్యాటగిరీస్, రైల్వే నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరి, మినిస్టీరియల్&ఐసోలేటెడ్ కేటగిరి, గ్రూప్-డి లెవెల్ వన్ నోటిఫికేషన్లను 2026-27 సంవత్సరంలో విడుదల చేయనున్నట్లు రైల్వే డిపార్ట్మెంట్ అధికారింగా పేర్కొంది. ఫిబ్రవరిలో అసిస్టెంట్ లోకో పైలట్ నోటిఫికేషన్ రిలీజ్ కానుంది. మార్చిలో టెక్నీషియన్. ఏప్రిల్‌లో సెక్షన్ కంట్రోలర్ నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. జులైలో పారామెడికల్, జేఈ. ఆగస్టులో ఎన్టీపీసీ, సెప్టెంబరులో మినిస్ట్రీరియల్ అండ్ ఐసోలేటెడ్ కేటగిరీలు. అక్టోబర్‌లో గ్రూప్-డి నియామాకాలు ఉండనున్నాయి. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా రైల్వే డిపార్ట్మెంట్ వెల్లడించింది. పూర్తి సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించండి.

# అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టురట్టు




హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టయింది. టాస్క్ ఫోర్స్ పోలీసులు, లంగర్ హౌస్ పోలీసులతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో భారీగా నిషేధిత డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు వైకుంఠరావుతో సహా మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 5 కిలోల హాష్ ఆయిల్, 5 కిలోల గంజాయి మరియు డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైకుంఠరావు ఒడిశాలో డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, వాటిని హైదరాబాద్ నగరంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.

**వంద మంది డ్రగ్స్ కన్స్యూమర్స్ గుర్తింపు**

ఈ అరెస్టు కేవలం సరఫరాదారులకే పరిమితం కాలేదు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, డ్రగ్స్ వినియోగదారుల నెట్‌వర్క్‌పై కూడా పోలీసులు దృష్టి సారించారు. డీసీపీ వైభవ్ మాట్లాడుతూ, ఈ ముఠా నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన దాదాపు వంద మంది డ్రగ్స్ కన్స్యూమర్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. ఈ స్థాయిలో వినియోగదారులను గుర్తించడం అనేది నగరంలో డ్రగ్స్ వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది, డ్రగ్స్ చైన్‌ను పూర్తిగా ఛేదించేందుకు, వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# బండి వర్సెస్ ఈటల

మొదటి పేజీ తరువాయి



అనుచరులు ఎక్కువ మంది బీజేపీ మద్దతుదారులుగా సర్పంచ్లు, వార్డు సభ్యులుగా బరిలో నిలబెట్టారు. ఈటల రాజేందర్ హుజూరాబాద్కు సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ఉన్న నేత. గత ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత మల్కాజిగిరి ఎంపీగా గెలిచారు. దీంతో ఆయన నియోజకవర్గం మారిపోయినట్లయింది. కానీ హుజూరాబాద్ లో మాత్రం పట్టు తనదేనని అంటున్నారు. కానీ హుజురాబాద్ బీజేపీలో బండి సంజయ్ వర్గీయులు కూడా బలంగా మారారు. వారే ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులు అయిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు మెంబర్లుగా బరిలో ఉన్నారు. అయితే తన అనుచరులకు అన్యాయం జరగకూడదని.. పార్టీలకు అతీతంగా ఎన్నికలు జరుగుతున్నందున తన అనుచరుల్ని కూడా బరిలోకి దింపారు. ఈ పోటీలో సర్పంచులుగా బండి సంజయ్ మద్దతుదారులే ఎక్కువగా గెలిచినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో బండి సంజయ్ పీఆర్వోగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి ఈటల రాజేందర్ ను కించ పరుస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ప్రచారం జరిగింది. ఈటల రాజేందర్ బీజేపీ తరపున కాదన్నట్లుగా ఆ పోస్టులు ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. శనివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడినప్పుడు ఈటల రాజేందర్ ఈ అంశంపై స్పందించారు. తాను బిజెపి పార్టీ ఎంపీనని .. కూడా కొన్ని పోస్ట్ లను చూసాను.. అవగాహన లేని, పిచ్చోళ్ళు పెట్టే పోస్టులు అవి అన్నారు. అవగాహన ఉన్నోడు అలా పోస్టులు పెడతాడా అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ ఏ పార్టీలో ఉన్నాడో ప్రజలు తేల్చుకుంటారని మండిపడ్డారు. వీటి పైన పార్టీ తేల్చుకుంటది.. టైమ్ విల్ డిసైడ్ అని వ్యాఖ్యానించారు. ఎవరు ఏమి చేస్తున్నారు.. ఎవరేం చెప్తున్నారో ప్రజలకు అర్థమవుతుందని.. సందర్భం వచ్చినప్పుడు అన్ని చెప్తానన్నారు. రెండు, మూడోవ విడత ఎన్నికల అయ్యాక జరిగిన పరిణామాలన్నీ చెప్తానన్నారు. అంటే.. పంచాయతీ ఎన్నికలు అయిన తరవాత ఆయన బ్లాస్ట్ అయ్యే అవకాశం ఉంది. హుజూరాబాద్ లో తన క్యాడర్ కు అన్యాయం జరిగితే తాను ఊరుకునేది లేదని కొంత కాలంగా ఈటల రాజేందర్ బహిరంగంగానే చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో తన తరపున వారికి న్యాయం జరగడం లేదన్న భావనలో ఉన్న ఈటల.. ఎన్నికల తరవాత ఫైరయ్యే అవకాశాలు ఉన్నట్లుగా భావిస్తున్నారు.

# పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

## పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన



వరంగల్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రెండవ విడతలో ఆదివారం నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు–2025 లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గీసుకొండ మండలంలోని గీసుగొండ జెడ్పిహెచ్ఎస్, సంగెం మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్, దుగ్గొండి మాండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలల్లో నల్లబెల్లి మండలంలోని సుమంగళీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం తమకు అందజేసే సామాగ్రిని జాగ్రత్తగా క్షుణంగా పరిశీలించుకోవాలని, అదనపు సామాగ్రి ఆర్.ఓ జోనల్ అధికారుల వద్ద ఉంటుందని అవసరమైన వారు ఆయా అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఫామ్ 9 ప్రకారం సిబ్బంది తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్ చెక్ చేసుకోవాలని , పోలింగ్ , కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అందించిన సామాగ్రిని జాగ్రత్తగా సీల్ చేసి డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా ఏర్పాటు చేశామని వాటి ద్వారా సందేహాలను నివృత్తి చేసుకొని ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రాం రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, ఎం పి డి ఓ లు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రేపు ఆదివారం నిర్వహించనున్న రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు మండలాల్లో 155 గ్రామపంచాయతీలకు సర్పంచ్, 1,392 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికల ప్రక్రియలో భాగంగా 16 గ్రామాల్లో సర్పంచ్ పదవులు, 386 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. దీంతో మిగిలిన 138 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులకు, 1006 వార్డులకు రేపు ఆదివారం ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు ప్రారంభించనుండగా, అదే రోజున ఫలితాలు ప్రకటించేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకోసం లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రెండవ విడత ఎన్నికలు అన్నపురెడ్డిపల్లి, అస్వారావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ములకపల్లి, పాల్వంచ మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విడతలో మొత్తం 1,392 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,11,892 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, సీల్స్, ఓటర్ల జాబితాలు, ఫారాలు తదితర అన్ని ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే తరలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరుకుని విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులకు ముందుగానే శిక్షణ అందించామని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భద్రతా పరంగా జిల్లా పోలీస్ శాఖతో సమన్వయం చేసి సున్నితమైన, అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చెక్ పోస్టులు, మొబైల్ ప్యాట్రోలింగ్ ద్వారా అక్రమ నగదు, మద్యం రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కీలక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వెబ్ కాస్టింగ్ ద్వారా ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది అందరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ సహకరించాలని కోరారు. జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు

# ఎన్నికలు పకడ్బందీగా సమన్వయంతో పని చేయాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికలు –25, సందర్భంగా జిల్లాలో రెండవ, మూడవ విడతలలో జరగబోయే ఎన్నికలను పకడ్బందీగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల కమిషనర్ సూచనల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో రెవెన్యూ, కె.అనిల్ కుమార్, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులతో ఆయన రెండు, మూడవ విడత ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్ ఎన్ఐసి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఐదు మండలాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, రేపు జరగబోయే రెండవ విడత ఎన్నికలు అదేవిధంగా ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికల సామాగ్రిని బ్యాలెట్ బాక్స్ లను పంపిణీ చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ వారికి సూచించిన ప్రకారం విధులు జాగ్రత్తగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. 17వ తేదీన మూడవ విడత ఎన్నికల జరిగే మండలాలు (6) డోర్నకల్, గంగారం, కొత్తగూడ, కురవి, మరిపెడ, సిరోలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిస్ట్రిబ్యూషన్ , రిసెప్షన్ సెంటర్లలో భోజన వసతి, త్రాగునీరు, చైర్స్, టెంట్స్, రవాణా సదుపాయం, వైద్య శిబిరాలు, తదితర తగిన ఏర్పాట్లు చేయాలని, ముందస్తు సమాచారం అందిస్తూ ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు జారీ చేయాలని సూచించారు, పోలింగ్ బ్యాలెట్ బాక్సులు సామాగ్రి, పోలింగ్ ముందు రోజు పోలింగ్ తర్వాత భద్రత మధ్య సంబంధిత రిసెప్షన్ సెంటర్లకు తరలించాలని, పూర్తిగా పారదర్శకంగా ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రదేశాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందించాలని సూచించారు. పూర్తి స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేసే ఎన్నికల విజయవంతనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ప్రత్యేక అధికారులు,ఆరు మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి




## కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14వ తేదీన జరుగనున్న పోలింగ్ నిర్వహణకు పంపిణీ చేస్తున్న మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిట్యాల, భూపాలపల్లి, టేకుమట్ల, పలిమెల మండలాల్లో 82728 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వయో వృద్ధులు, దివ్యాన్గుల కొరకు వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచాలని సంక్షేమ అధికారికి సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో మెటీరియల్ తీసుకున్న పిఓ, ఓపిఓలు మెటీరియల్ జాగ్రత్తగా పరిశీలించాలని, ఏదేని కొరత ఉన్నట్లు గమనిస్తే తక్షణమే సంబంధిత అధికారుల

దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 14వ తేదీన పోలింగ్ నిర్వహణకు ఓటింగ్ కంపార్ట్ మెంట్ వంటి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం వంటి గంటకు పూర్తి అవుతుందని, తదుపరి 2 గంటల నుండి లెక్కింపు ప్రారంభించాలన్నారు. లెక్కింపు పూర్తి అయిన తదుపరి సాధారణ పరిశీలకుల అనుమతితో గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించాలని స్పష్టం చేశారు. పీ.ఓలు, ఓ.పీ.ఓలు అందరు హాజరయ్యారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరు కానీ సిబ్బంది వివరాలు అందచేయాలని, తదుపరి వారిపై ఎన్నికల సంగం మార్గదర్శకాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పిఓలు, ఓపిఓలతో మొత్తం మెటీరియల్ తీసుకున్నారా, పరిశీలించారా, అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ నిర్వహణ, తదుపరి ఓట్లు లెక్కింపులో ఎలాంటి పొరపాటుకు అవకాశం లేకుండా ఎన్నికల సంగం మార్గదర్శకాలు మేరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ సామాగ్రి తరలింపును రూటు అధికారులు పర్యవేక్షణతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు.

**విధులు నిర్వహించు సిబ్బంది**

**పోలింగ్ అధికారుల సంఖ్య: 833**

**అదనపు (రిజర్వ్) సిబ్బంది: 924**

**మొత్తం పోలింగ్ సిబ్బంది: 1757**

అలాగే పర్యవేక్షణ కోసం నలుగురు జిల్లా స్థాయి అధికారులు,13 మంది జోనల్ అధికారులు, 17 మంది రూట్ అధికారులు, 26 మంది మైక్రో అబ్జర్వర్లు, 33 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 769 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఓటరు నిష్పక్షపాతంగా, స్వేఛగా తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి, ఎంపిడిఓ జయశ్రీ, తహసీల్దార్ ఇమామ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# నేడే రెండో విడత పోలింగ్

## మధ్యాహ్నం తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభం

## హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత హనుమకొండ జిల్లాలోని ఐదు మండలాల్లో ఆదివారం రోజున జరగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, హసన్ పర్తి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఐనవోలు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, వేలేరు, పరకాల మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రితో ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బయలుదేరి వెళ్లారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పోలింగ్ కేంద్రాలలో ఆదివారం జరగనున్న పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో రెండో విడతలో ఎన్నికలు జరుగుతున్న ఐదు మండలాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు పోలింగ్ కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**రెండో విడత ఎన్నికలకు సంబంధించిన వివరాలు**

హనుమకొండ జిల్లాలో రెండో విడతలో ఈనెల 14న( ఆదివారం రోజున) ఐదు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో మొత్తం ఓటర్లు 1,28,315 ఉన్నారు. ఇందులో పురుషులు 62692, మహిళలు 65621, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఐదు మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 73, వార్డులు 694 ఉన్నాయి. రెండో విడతలో వార్డులు, సర్పంచ్ స్థానాలు కలిపి ఏకగ్రీవ గ్రామపంచాయతీలు 5 ఉన్నాయి. ఒక గ్రామపంచాయతీకి సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీలు 67 ఉండగా ఇందులో పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు 248 కాగా పోటీలో ఉన్న వార్డు సభ్యుల అభ్యర్థులు 1442 మంది ఉన్నారు. మొత్తం వార్డులు 694 ఉండగా ఇందులో ఏకగ్రీవమైన వార్డులు 120 ఉన్నాయి. పోలింగ్ జరిగే వార్డు స్థానాలు 574 ఉన్నాయి. ఐదు మండలాల్లో మొత్తం పోలింగ్ కేంద్రాలు 658, ప్రిసైడింగ్ అధికారులు 658,ఓపివోలు –961(మొత్తం పిఓ, ఓపిఓలు 1619), 23మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

# పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన**



ములుగు జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రెండవ విడతలో ఆదివారం నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ములుగు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, వెంకటాపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ[illegible]ంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం తమకు అందజేసే సామాగ్రిని జాగ్రత్తగా క్షుణంగా పరిశీలించుకోవాలని, అదనపు సామాగ్రి ఆర్.ఓ జోనల్ అధికారుల వద్ద ఉంటుందని అవసరమైన వారు ఆయా అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఫామ్ 9 ప్రకారం సిబ్బంది తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్ చెక్ చేసుకోవాలని , పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అందించిన సామాగ్రిని జాగ్రత్తగా సీల్ చేసి డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా ఏర్పాటు చేశామని వాటి ద్వారా సందేహాలను నివ ృత్తి చేసుకొని ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారులు, ఎం పి డి ఓ లు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): హసన్ పర్తి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను కలెక్టర్ పరిశీలించారు. మండల పరిధిలో ఎన్ని గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన పిఓలు, ఓపివోలు వచ్చారా అని, పోలింగ్ సామగ్రి పంపిణీ నిర్వహణకు ఏర్పాట్లు, రూట్ల వారీగా వాహనాల ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను ఎంపీడీవో సుమన వాణి, మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా బ్యాలెట్ పేపర్లు అన్ని సరిగా ఉన్నాయా లేదా చెక్ చేశారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజర్వ్ లో ఉన్న పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెండో విడతలో హనుమకొండ జిల్లాలో హసన్ పర్తి, ధర్మసాగర్, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో ఆదివారం పోలింగ్ జరగనుందని తెలిపారు. ఈ ఐదు మండలాల్లో 73 గ్రామపంచాయతీలు, 694 వార్డులున్నాయని పేర్కొన్నారు. రెండో విడత మండలాల్లో ఐదు గ్రామపంచాయతీలు సర్పంచ్, వార్డు, ఉపసర్పంచ్ స్థానాలు అన్నీ కలిపి ఏకగ్రీవమయ్యాయని, ఒక గ్రామంలో సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైందని అన్నారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో జిల్లా లోని 67 సర్పంచి స్థానాలకు , 574 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. రెండో విడతలోని పెద్ద గ్రామపంచాయతీలలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా త్వరగా పూర్తిచేసే విధంగా ఎక్కువ కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రెండు వేలకు పైగా ఓటర్లు ఉన్న ప్రతి గ్రామపంచాయతీలో ఓట్ల లెక్కింపునకు మూడు కౌంటింగ్ టేబుల్స్ వేసి ఓట్ల లెక్కింపును చెపట్టనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడో విడత ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. ఏకగ్రీవ గ్రామపంచాయతీ లతోపాటు మొదటి విడత ఎన్నికలు పూర్తయిన మండలాల్లోనూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు . ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో ఐదు మండలాల్లో 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామని, అక్కడ మైక్రో అబ్జర్వర్ విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. మొదటి విడత గ్రామపంచాయతీలలో ఒక వార్డు తర్వాత ఒక వార్డు కౌంటింగ్ చేయడంతో కొంత ఆలస్యం జరిగిందని, అలా కాకుండా కౌంటింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా ద ృష్టిని సారించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే శిక్షణ పొంది ఉన్నారని, ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఎన్నికలను నిర్వహిస్తున్నారని తెలియజేశారు. రెండో విడత ఓట్ల కౌంటింగ్ పై ప్రత్యేక ద ృష్టిని సారించామని, పెద్ద గ్రామాలైన ధర్మసాగర్, నాగారం గ్రామాలలో ఎక్కువ టేబుల్స్ పెట్టాలని, ధర్మసాగర్ లో ఏడు టేబుల్స్ తో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

**ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోవాలి**

హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, పోలింగ్ కేంద్రాలలో టెంట్లు, తాగునీరు, దివ్యాంగుల కోసం వీల్ చైర్ ఏర్పాటు చేస్తున్నామని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, బిఎల్వో లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 14వ తేదీన (ఆదివారం ) ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఉంటుందని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించి సర్పంచ్, వార్డు స్థానాల ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు.


# ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఓటు హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని...ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జరగనున్న రెండవ విడత పోలింగ్ కి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, పోలింగ్ కేంద్రాలలో టెంట్లు, తాగునీరు, దివ్యాంగుల కోసం వీల్ చైర్ ఏర్పాటు చేస్తున్నామని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 14వ తేదీన (ఆదివారం ) ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఉంటుందని మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు

# ఫామ్‌హౌస్ కోసమే RRR అలైన్‌మెంట్ మార్పు..?



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత జిల్లా పర్యటన జోరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆమె బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మాజీ ఎమ్మెల్యేలపై విరుచుకుపడుతూ ముందుకెళ్తున్నారు. బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ మంత్రి హరీశ్ రావుపై కవిత చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలో కవిత మాట్లాడుతూ రెడ్డిపల్లి, చిప్పలతుర్తి, తుంకి ఈ మూడు గ్రామాల మధ్య హరీశ్ రావుకు చెందిన 400 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందన్నారు. ఈ క్రమంలోనే రీజినల్ రింగ్ రోడ్డుతో భూముల వాల్యూ పెరిగేందుకు ఆ ఫామ్‌హౌస్ పక్కనుంచే పోయేలా అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. అక్కడ ఓ ఫైవ్ స్టార్ రిసార్టు కూడా నడుపుతున్నారనే విషయాన్ని బయటపెట్టారు. ప్రస్తుతం కవిత చేసిన ఆరోపణలు నెట్టింట్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. కాగా, మరోవైపు తెలంగాణ సర్కార్ హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు సుమారు 40 కి.మీ. దూరంతో రెండు భాగాలుగా ఆర్ఆర్ఆర్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటుగా టెండర్లు కూడా పిలిచింది. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై హెచ్ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. వంద మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు అవతల ఎనిమిది జిల్లాల మీదుగా వెళ్తుంది. ఈ నోటిఫికేషన్‌లో డిజిటల్ మ్యాప్‌తో పాటు, ఆర్ఆర్ఆర్ వెళ్లే సర్వే నంబర్ల వివరాలను కూడా వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రాజెక్టు కింద రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్గొండ, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, యాదాద్రి-భువనగిరి జిల్లాల పరిధిలోని 33 మండలాలు, 163 రెవెన్యూ గ్రామ పంచాయతీలను కవర్ చేయనుంది. ఈ ప్రాజెక్టు వల్ల ఆయా ప్రాంతాల్లోని భూములకు విలువ పెరగడంతో పాటు, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు.

# సీబీఎస్ఈ టెన్త్ ఎగ్జామ్స్ ప్యాటర్న్ చేంజ్

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 2026లో జరగనున్న 10వ తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించి ఒక పెద్ద మార్పు చేసింది. ఈ విషయంలో అన్ని అనుబంధ పాఠశాలలకు సీబీఎస్ఈ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రత్యేకంగా సైన్స్, సోషల్ పరీక్షలకు సంబంధించి మార్పు చేశారు. ఈ మార్పుల లక్ష్యం పరీక్ష ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించడం. సమాధాన పత్రాల మూల్యాంకనంలో జరిగే తప్పులను నివారించడం అని పేర్కొంది. సీబీఎస్ఈ ప్రకారం, 10వ తరగతి సైన్స్ ప్రశ్న పత్రాన్ని ఇప్పుడు 3 స్పష్టమైన విభాగాలలో విభజిస్తారు. ఇందులో జీవశాస్త్రం, రసాయన శాస్త్రం , భౌతిక శాస్త్రాలకు వేర్వేరు విభాగాలు ఉంటాయి. అదేవిధంగా సోషల్ ప్రశ్నాపత్రం నాలుగు భాగాలుగా ఉంటుంది. ఇందులో చరిత్ర, భూగోళ శాస్త్రం, పాలిటీ, ఆర్థశాస్త్రాలను వేర్వేరు విభాగాలలో ఉంచుతారు. ఈ కొత్త విధానం 2026 బోర్డు పరీక్షల నుండి అమలులోకి వస్తుందని సీబీఎస్ఈ బోర్డు స్పష్టం చేసింది.స్కూల్స్ ఈ కొత్త పరీక్షా విధానంతో విద్యార్థులను ముందుగానే పరిచయం చేయాలని సీబీఎస్ఈ బోర్డు సూచించింది. బోర్డు పరీక్ష సమయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు, చదువుతున్నప్పుడే విద్యార్థులకు విభాగాల వారీగా సమాధానాలు రాసేలా చూడాలని పాఠశాలలను కోరారు. దీనితో పాటు, తాజా నమూనా ప్రశ్నా పత్రాలను తప్పనిసరిగా చూడాలని సీబీఎస్ఈ విద్యార్థులకు సూచించింది. నమూనా పత్రాలు టెన్త్ ఎగ్జామ్స్ ప్రశ్నా పత్రం ఫార్మాట్, విభాగాల సంఖ్య, ప్రశ్నల రకాలు, మార్కుల విభజనను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు సహాయపడతాయని సీబీఎస్ఈ తాజా ప్రకటనలో తెలిపింది. నమూనా పత్రంతో పాటు జారీ చేసిన మార్కింగ్ స్కీమ్ను చూడటం ద్వారా, సమాధానాలను ఎలా రాయడం ద్వారా పూర్తి మార్కులు పొందవచ్చో కూడా విద్యార్థులు తెలుసుకోవచ్చు. సరైన సమాచారం కోసం సీబీఎస్ఈ అధికారిక వెబ్సైట్ను మాత్రమే సంప్రదించాలని విద్యార్థులకు బోర్డు సూచించింది.

# పోగు బంధంతో ఫోన్ బంధం



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన చేనేత శాలువాను నంది నగర్ నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ క్యూఆర్ కోడ్‌తో పోగు బంధంతో ఫోన్ బంధం ఏర్పడనుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను తెలిపే ఈ శాలువాను నేసిన సిరిసిల్లకు చెందిన నేతన్న నల్ల విజయ్ కుమార్ రూపొందించారు. తెలంగాణలోని ప్రముఖ దేవాలయాలు, ప్రముఖ కట్టడాలు సంప్రదాయాలు, కేసీఆర్ ప్రభుత్వ సమయంలో చేసిన మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల వివరాలు తెలిసేలా రూపొందించారు. ఈ సందర్భంగా నల్ల విజయ్‌ను కేటీఆర్ అభినందించారు. కేటీఆర్ వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జనరల్ సెక్రటరీ రావు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్, సీనియర్ నేత జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు ప్రగతి పథంలో సాగిన పల్లెల్లో రెండేండ్లుగా పాలనపడకేసిందని అంతకుముందు కేటీఆర్ విమర్శించారు. పంచాయతీలను పట్టించుకొనే నాథుల్లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'కాంగ్రెస్ పాలనలో పారిశుధ్యం గాడి తప్పింది' అంటూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఈ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం సమీప భవిష్యత్తులో పాతాళానికి పడిపోవడం ఖాయమని చెప్పారు.

# రామేశ్వరం కేఫ్‌లో పొలిటికల్ టిఫిన్

### కేటీఆర్‌తో దక్షిణాది రుచులను ఆస్వాదించిన అఖిలేశ్ యాదవ్
### రామేశ్వరం కేఫ్ రుచులు అద్భుతం
### యజమాని శరత్‌పై అఖిలేశ్ ప్రశంసలు



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం హైదరాబాద్‌లోని ప్రసిద్ధ 'రామేశ్వరం కేఫ్'లో కలిసి టిఫిన్ చేశారు. నగరంలో ఎంతో ఆదరణ పొందిన రామేశ్వరం కేఫ్ రుచుల గురించి, అక్కడ లభించే ప్రత్యేకమైన టిఫిన్స్ గురించి తెలుసుకున్న అఖిలేశ్ యాదవ్ ఆసక్తి కనబరచడంతో, కేటీఆర్ అక్కడే మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. సరదాగా సాగిన ఈ విందులో ఇరువురు నేతలు దక్షిణాది రుచులను ఆస్వాదిస్తూనే పలు రాజకీయ, సమకాలీన అంశాలపై కాసేపు ముచ్చటించారు. ఇక, వీరి రాక సందర్భంగా రామేశ్వరం కేఫ్ యజమాని శరత్ ఇరువురు నేతలకు ఘన స్వాగతం పలికి తగిన ఏర్పాట్లు చేశారు. అక్కడి వంటకాలను రుచి చూసిన అఖిలేశ్ యాదవ్ వాటి నాణ్యతను, రుచిని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. హైదరాబాద్‌లోనూ రామేశ్వరం కేఫ్‌ను ఇంత విజయవంతంగా నడుపుతుండటం పట్ల యజమాని శరత్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు అఖిలేశ్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. రామేశ్వరం కేఫ్‌లో లంచ్ కార్యక్రమం ముగిసిన అనంతరం, అఖిలేశ్ యాదవ్, కేటీఆర్ అక్కడి నుండి బయలుదేరి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి చేరుకున్నారు.

# సంక్రాంతి ప్రయాణికులకు గుడ్ న్యూస్

### దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు
### సికింద్రాబాద్ టు ఏపీ స్పెషల్ సర్వీసులు

సికింద్రాబాద్, డిసెంబర్ 13(తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగకు సొంతూరు వెళ్లేవారికి భారతీయ రైల్వే శుభవార్త చెప్పింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈరోజు ఉదయం 8గంటల నుంచి అడ్వాన్స్ బుకింగ్‌ను ఓపెన్ చేయనుంది. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. 2026 జనవరి నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా ఏపీలోని ఇతర ప్రాంతాలకు, అలాగే ఇతర రాష్ట్రాలకు ఈ రైళ్లు నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లలో 1AC, 2AC, 3AC, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

# విజన్ 2047 కాదు "పిల్లల పాలిట పాయిజన్ 2047"

### రేవంత్ నోరు విప్పితే అబద్ధాలే
### విద్యాశాఖ మంత్రిగా అట్టర్ ఫ్లాప్... సీఎంపై హరీష్ ఫైర్



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు విప్పితే అబద్ధాలే అని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి, అహంకారం, అరాచకంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైజింగ్ అంటూ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి ఢిల్లీ వెళ్లే సమయం ఉంది కానీ గురుకులాల్లో అస్వస్థతకు గురైన పిల్లలను పట్టించుకునే సమయం లేదా? అని ప్రశ్నించారు. బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో, విద్యార్థులను హైదరాబాద్ జిల్లా కింగ్ కోఠి ఆసుపత్రికి విద్యార్థులను తరలించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీష్ శనివారం ఉదయం విద్యార్థులను పరామర్శించి ఫుడ్ పాయిజన్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ గురుకులాల్లో వసతులు, భోజనం కూడా సరిగా లేదు. 90 మంది బాగ్‌లింగంపల్లి గురుకుల పాఠశాల పిల్లలు ఆసుపత్రి పాలయ్యారు. ఫుట్‌బాల్ ఆడటంలో సీఎం, మంత్రులు బిజీగా ఉన్నారు. మెస్సీతో మేస్త్రీ ఫుట్‌బాల్ ఆట కోసం రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కబ్జాలు, కమీషన్లకే రేవంత్ రెడ్డి పరిమితం పిల్లలను పట్టించుకోవడం లేదు. 61 సార్లు ఢిల్లీ వెళ్లడానికి సమయం ఉంటుంది కానీ పిల్లలను పరామర్శించరా?. రేవంత్‌ది విజన్ 2047 కాదు పిల్లల పాలిటి పాయిజన్ 2047. మొన్న శామీర్‌పేట బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తున్నాయని పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు ఫిర్యాదు చేశారు. మాదాపూర్‌లో 43 మంది విద్యార్థులు కొండాపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి. అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని విద్యార్థులు ఉన్నారు. దొడ్డు బియ్యం పెడుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఫుట్‌బాల్ ఆడటంలో రేవంత్ బిజీగా ఉన్నారు. ప్రజల సొమ్ముతో సీఎం సోకులు తీర్చుకుంటున్నారు. కబ్జాలు, కమీషన్లకే టైమ్ సరిపోవడం లేదా?. విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్. మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఉంది ప్రభుత్వ తీరు. బాత్ రూమ్‌లు కడిగే బ్రష్‌లతో వంట సామన్ కడుగుతున్నారట. చలి తీవ్రత పెరిగింది. చల్ల నీళ్లతో అమ్మాయిలు స్నానం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్లలో 116 మంది విద్యార్థులు చనిపోయారు. విద్యార్థుల తల్లిదండ్రులు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. విద్యా కమిషన్ ఎక్కడికి పోయింది?. పేదల మనసులు చదువుతా అని డైలాగ్స్ కొట్టడం కాదు పేద పిల్లల ఆకలి తీర్చండి. రాహుల్ గాంధీ పేదల కోసం రాడు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయడు. ఫుట్ బాల్ మ్యాచ్ చూడటానికి రాహుల్ గాంధీ వస్తారట. ఇచ్చిన హామీలు అమలు కాకపోతే రాహుల్ ఎందుకు అడగడం లేదు?. కోఠి, నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను అడిగి తెలుసుకోవాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. చిన్నారులు నేను పోను గురుకుల పాఠశాలకు అన్నట్లుగా మార్చారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్ పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31న జరిగే వేడుకలకు సంబంధించి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హోటళ్లు, క్లబ్బులు, పబ్‌ల నిర్వాహకులకు శనివారం కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అనుమతి తప్పనిసరి**

సమయపాలన ముఖ్యం డిసెంబర్ 31 అర్ధరాత్రి దాటిన తర్వాత ఈవెంట్లు నిర్వహించాలనుకునే సంస్థలు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి పొందాలని సీపీ స్పష్టం చేశారు. ఇందుకోసం కనీసం 15 రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో రాత్రి 10 గంటలకే లౌడ్‌స్పీకర్లు, డీజేలను నిలిపివేయాలి. అయితే, అనుమతి పొందిన ఇండోర్ రెస్టారెంట్లు, బార్లలో రాత్రి 1 గంట వరకు మ్యూజిక్‌కు వెసులుబాటు కల్పించా రు. శబ్ద తీవ్రత 45 డెసిబెల్స్ మించకూడదని సూచించారు.

**భద్రత, అశ్లీలతపై నిఘా**

తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం ప్రకారం.. వెన్యూల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రైవేట్ సెక్యూరిటీని నియమించుకోవాలి. వేడుకల్లో అశ్లీల నృత్యాలు, నగ్నత్వ ప్రదర్శనలకు తావులేదని, అలాగే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల పంపిణీ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పబ్‌లు, బార్లలో జంటల కోసం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు మైనర్లను అనుమతించకూడదని స్పష్టం చేశారు.

**నిర్వాహకులదే బాధ్యత**

మద్యం సేవించిన కస్టమర్లను సురక్షితంగా ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత ఆయా సంస్థలదేనని సీపీ సజ్జనార్ తేల్చిచెప్పారు. వారి కోసం ప్రత్యేకంగా డ్రైవర్లను, క్యాబ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సామర్థ్యానికి మించి టికెట్లు విక్రయించి, లా అండ్ ఆర్డర్ సమస్యలకు కారణమైతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వేడుకల్లో పటాసుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ ఫోకస్**

న్యూ ఇయర్ రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. రక్తంలో ఆల్కహాల్ మోతాదు 30 ఎంజీ/100 ఎంఎల్ దాటితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పట్టుబడిన వారికి రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలల పాటు లేదా శాశ్వతంగా రద్దు చేస్తారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులదే బాధ్యత. సైలెన్సర్ తొలగించి శబ్ద కాలుష్యం చేయడం, రేసింగ్, రాష్ డ్రైవింగ్‌లకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తారు. మహిళల భద్రత కోసం నగరమంతటా షీ టీమ్‌లను మోహరించినట్లు సీపీ తెలిపారు.

# మెస్సీ రాకపై పోలీసుల హై అలర్ట్

### మెస్సీ, రాహుల్ పర్యటనకు పగడ్బందీ భద్రత
### సీపీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కోల్‌కతా పర్యటన సందర్భంగా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సిని కళ్లారా చూసేందుకు సాల్ట్‌లేక్ స్టేడియానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే, నిర్వాహకులు, పోలీసుల వైఫల్యం కారణంగా మెస్సి మ్యాచ్ ఆడకుండానే స్టేడియం నుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆగ్రహానికి గురైన అభిమానులు స్టాల్‌లేక్ స్టేడియంలోకి కుర్చీలు, వాటర్ బాటిళ్లు విసిరేశారు నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే కాసేపట్లో లియోనల్ మెస్సి, రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తున్న తరుణంలో భద్రతా ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో తాము మరింత అప్రమత్తమయ్యామని అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్‌కు మెస్సీ, రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి వెళ్తారని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. మరోవైపు రాచకొండ కమిషనర్ ఎప్పటికప్పుడు ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారని, భద్రత విషయంలో నో టెన్షన్ అంటూ సజ్జనార్ చెప్పుకొచ్చారు.

# విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు


### నాణ్యమైన విద్యే సర్కార్ లక్ష్యం
### యంగ్ ఇండియా స్కూల్స్ కోసం రూ.21,000 కోట్లు
### 105 నియోజకవర్గాల్లో ఏర్పాటు
### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కాలానుగుణంగా మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో సమూలమైన, విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాలుగా విద్యారంగాన్ని అత్యున్నత ప్రాధాన్యత అంశంగా గుర్తించి, "విద్యార్థులకు నాణ్యమైన విద్య" అనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని మంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ఉపాధ్యాయుల భర్తీ, డిజిటల్ లెర్నింగ్, స్కిల్ ఎడ్యుకేషన్ వరకు విద్యారంగంలోని ప్రతి దశలో సమగ్ర మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. బ్రెయిన్ ఫీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహించిన ఈటీ టెక్ ఎక్స్ – 6వ ఎడిషన్ కార్యక్రమానికి శనివారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ రోజుల్లో వేగంగా మారుతున్న విద్యా ప్రపంచంలో ఈటీ టెక్ ఎక్స్ వంటి వేదికలు అత్యంత అవసరమని, టెక్నాలజీ–విద్య కలిసి భవిష్యత్తును ఎలా నిర్మించాలి అనే అంశంపై ఆలోచించేందుకు, చర్చించేందుకు ఇవి దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులందరూ ఒకే క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలతో కలిసి చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు. రాష్ట్రంలోని 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.21,000 కోట్ల పెట్టుబడి. ప్రతి పాఠశాలను 25 ఎకరాల విశాల ప్రాంగణంలో, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ఏర్పాటు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో, 2024 డీఎస్సీ ద్వారా పది వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. 2024 సెప్టెంబర్ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం అమలు చేస్తున్నామని, దీనికోసం ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ.140 కోట్ల వ్యయాన్ని భరిస్తోందని మంత్రి వెల్లడించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.642 కోట్ల వ్యయంతో 59 వేల మౌలిక సదుపాయాల పనులు పూర్తి. పాఠశాలల పరిశుభ్రత, తరగతి గదుల మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి అప్పగిస్తూ సుమారు రూ.146 కోట్ల నిధులు కేటాయింపు. యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ యూనివర్సిటీ ఈ సంవత్సరంనుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రారంభించనుందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి యువతకు తక్షణ ఉపాధి కల్పించడమే లక్ష్యమని అన్నారు. అదే విధంగా, యువత పరిశ్రమలకు తగిన నైపుణ్యాలు నేర్చుకునేలా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు కూడా తెలంగాణ ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ లక్ష్యంతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది చారిత్రాత్మక ముందడుగు అని పేర్కొన్నారు. అన్ని చర్యలతో విద్యార్థులకు విస్తృత అవకాశాలు లభిస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు బలపడతాయని, రాష్ట్రంలో వృత్తి ఆధారిత విద్యకు బలమైన పునాది పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఊపిరితిత్తులను సహజంగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు.!

మన శరీరంలో ఊపిరితిత్తులు అనేవి అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ప్రస్తుత జీవనశైలిలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే పెరిగిపోతున్న కాలుష్యం, స్మోకింగ్ వంటివి ఊపిరితిత్తులను నాశనం చేస్తున్నాయి. కాబట్టి, ఊపిరితిత్తులను శుభ్రం చేస్తే, వాటి సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులను సహజంగా ఎలా క్లీన్ చేసుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..



**ఊపిరితిత్తులను ఇలా క్లీన్ చేయవచ్చు.. తులసి**

తులసి ఊపిరితిత్తులను సహజంగా శుభ్రపరచడంలో సహాయపడుతుంది. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం కలిగించడానికి సహాయపడతాయి. దీనిని తేనె, అల్లంతో కలిపి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వంటి సమస్యలకు కూడా ఉపశమనం లభిస్తుంది.

**అల్లం**

అల్లం కూడా ఊపిరితిత్తులను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలున్నాయి. ఇవి శ్వాసనాళాల నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడతాయి. అల్లం.. పొటాషియం, మెగ్నీషియం, బీటా-కెరోటిన్, జింక్ వంటి అనేక విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటుంది. అల్లంలోని యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసకోశంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా అల్లం నీరు తాగడం వల్ల ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**పసుపు**

పసుపులో ఉండే కర్కుమిన్ అనే సమ్మేళనం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మంటను తగ్గించి, శ్లేష్మం తొలగించడంలో సహాయపడుతుంది. పసుపు సహజంగా ఊపిరితిత్తులను శుభ్రపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఇది శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది, ఇది ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది. పసుపును మీరు ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీ ఊపిరితిత్తులు సహజంగా క్లీన్ అవుతాయని నిపుణులు అంటున్నారు.

# రక్త ప్రసరణపై చలిపంజా!



రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. ఈ పరిస్థితి శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు కుచించుకుపోయి.. రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే.. సమస్య మరింత ముదురుతుంది. చలికాలం వచ్చిందంటే.. కొందరిలో కాళ్లు, చేతులు ముడుచుకుపోతుంటాయి. వేళ్లలో వాపు, దురద లాంటి సమస్యలు కనిపిస్తాయి. వాతావరణంలో చలి పెరగడమే ఇందుకు కారణం. రక్త ప్రసరణపై చలి ప్రభావం వల్లే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయని నిపుణుల మాట. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువ ప్రభావం చూపుతుంది. తెల్లవారుజామునే లేవడం, చలిలో వాకిలి ఊడ్చడం, కల్లాపి చల్లడం లాంటి పనులు చేస్తుంటారు.

వంట గదిలోనూ కూరగాయలు కడగడం, అంట్లు తోమడం లాంటి నీటితో చేసే పనుల్లోనే రోజంతా తలమునకలై ఉంటారు. చలి తీవ్రత, చల్లని నీటి ప్రభావం వల్ల వారి శరీరంలో సిరలు కుంచించుకుపోతాయి. దాంతో రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. కొన్నిరోజులకు రక్తం గడ్డకట్టడం మొదలవుతుంది. ఫలితంగా.. కాళ్లు, చేతుల వేళ్లలో వాపు కనిపిస్తుంది. సమస్య ముదిరితే.. దురదతోపాటు నొప్పి కూడా వస్తుంది. దీనివల్ల రోజువారీ పనులలో తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది.

**సమస్యకు పరిష్కారం?**

చలికాలంలో చాలామందిలో కాళ్లు, చేతులలో వాపు సాధారణంగానే కనిపిస్తుంది. అయితే, నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన సమస్యగా మారుతుంది. ఎక్కువ చలిగా ఉన్నప్పుడు బయటికి రాకపోవడమే మంచిది. కాళ్లు, చేతులను కప్పి ఉంచేలా వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవడం వల్లకూడా ఈ సమస్య కనిపిస్తుంది. కాబట్టి, తగినంత నీరు తీసుకోవాలి. వేళ్ల వాపును తగ్గించడానికి చిన్నచిన్న స్ట్రెచెస్, వ్యాయామాలను ఆశ్రయించాలి. సమస్య మరీ తీవ్రంగా ఉంటే.. వైద్యులను సంప్రదించాలి.

# రాత్రి పూట తినాల్సిన పండ్లు ఇవే..

## వీటిని తింటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి..!



ఎప్పటికప్పుడు సీజన్లలో లభించే పండ్లతోపాటు మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉండే పండ్లను తరచూ తినడం వల్ల మనకు ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే పండ్లను రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. పండ్లను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. అనేక రకాల విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లను మనం పండ్ల ద్వారా పొందవచ్చు. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. కొందరు పండ్లను కేవలం జ్వరం వచ్చినప్పుడు లేదా అనారోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే తింటారు. కానీ పండ్లను రోజూ తినాల్సిందేనని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే పగటి పూట పండ్లను తినడం వీలు కావడం లేదన్న వారు రాత్రి పూట వాటిని తినవచ్చు. కానీ రాత్రి పూట ఏ పండ్లను పడితే వాటిని తినకూడదు. రాత్రి పూట తినదగిన పండ్లు కొన్నే ఉన్నాయి. వాటిని ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**కివి పండ్లు..**

రాత్రి పూట తినదగిన పండ్లలో కివిలు ప్రథమ స్థానంలో నిలుస్తాయని చెప్పవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల మన శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది నిద్రను ప్రేరేపించే హార్మోన్. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. అలాగే ఈ పండ్లను తింటుంటే యాంటీ ఆక్సిడెంట్లు పెద్ద మొత్తంలో లభిస్తాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. కివి పండ్లను రాత్రి పూట తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. అలాగే మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**చెర్రీలు, అరటి పండ్లు..**

ఇక రాత్రి పూట తినాల్సిన పండ్లలో చెర్రీలు కూడా ఒకటి. ఈ పండ్లను తినడం వల్ల మన శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది కూడా నిద్రను ప్రేరేపిస్తుంది. ఒత్తిడి, ఆందోళన నిద్రలేమి సమస్యలు ఉన్నవారు రాత్రి పూట ఈ పండ్లను తింటుంటే ఉపయోగం ఉంటుంది. చెర్రీ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఇక రాత్రి పూట అరటి పండ్లను తినవచ్చు. కానీ కఫం అధికంగా ఉత్పత్తి అయ్యే వారు, అధిక బరువు ఉన్న వారు ఈ పండ్లను రాత్రి పూట తినకూడదు. మిగిలిన ఎవరైనా ఈ పండ్లను రాత్రి పూట తినవచ్చు. అరటి పండ్లను రాత్రి పూట తినడం వల్ల మెగ్నీషియం అధికంగా లభిస్తుంది. దీని వల్ల రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. అలాగే అరటి పండ్లలో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగుపరిచి బీపీని నియంత్రిస్తుంది. దీని వల్ల రాత్రి పూట బీపీ పెరగకుండా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

**బెర్రీలు, అవకాడో..**

ఇక రాత్రి పూట బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా తినవచ్చు. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మనకు నిద్ర చక్కగా పట్టేలా చేస్తాయి. నిద్రలేమిని తగ్గిస్తాయి. అలాగే క్యాన్సర్ కణాలతో పోరాటం చేస్తాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటాయి. రాత్రి పూట అవకాడో పండ్లను సైతం తినవచ్చు. వీటిల్లో ఉండే మెగ్నీషియం రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోకుండా చూస్తుంది. ఈ పండ్లలోని మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్లు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో రాత్రి పూట ఆహారం ఎక్కువగా తినకుండా జాగ్రత్త పడవచ్చు. దీని వల్ల బరువు తగ్గడం తేలిగ్గా మారుతుంది. అలాగే రాత్రి పూట పుచ్చకాయలు, తర్బూజాలను కూడా తినవచ్చు. అతి మూత్ర వ్యాధి ఉంటే వీటిని తినకూడదు. రాత్రి పూట ఈ పండ్లను తినడం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. అంతేకాకుండా నిద్ర చక్కగా పడుతుంది. ఇలా రాత్రి పూట ఆయా పండ్లను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది.




# డయాబెటిస్ వారికి ఎంతో మేలు చేసే పండ్లు ఇవే!

ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటిలో డయాబెటిస్ కూడా ఒకటి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు డయాబెటిస్‌కు కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే, డయాబెటిస్ ఉన్నవారు తరచుగా ఏం తినాలి, ఏవ తినకూడదు అనే దాని గురించి ఆందోళన చెందుతారు. అయితే, డయాబెటిస్ ఉన్న వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ పండ్లు షుగర్ లెవెల్స్‌ను కంట్రోల్ చేస్తాయని చెబుతున్నారు.

**సిట్రస్ పండ్లు:**

నిమ్మకాయలు, నారింజ, చిలగడదుంప వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. సిట్రస్ పండ్లలో అనేక ఇతర పోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వీటిలో చక్కెర చాలా తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వాటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ఉన్నవారు వాటిని వారి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు.

**రాస్బ్బెర్రీస్:**

రాస్బ్బెర్రీస్‌లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అవి మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో కూడా సమృద్ధిగా ఉంటాయి. రాస్బ్బెర్రీస్‌ను ప్రతిరోజూ తినడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వాటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇవి జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తాయని నిపుణులు అంటున్నారు.

**స్ట్రాబెర్రీలు:**

చాలా మంది కొంచెం తీపిగా, కొంచెం పుల్లగా ఉండే స్ట్రాబెర్రీలలో చక్కెర ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. 100 గ్రాముల స్ట్రాబెర్రీలలో 7 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు వాటిని నిస్సందేహంగా తినవచ్చని నిపుణులు అంటున్నారు.

**కివి:**

ఈ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తాయని నిపుణులు అంటున్నారు. 100 గ్రాముల కివి పండులో కేవలం 9 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది.

**అవకాడో:**

అవకాడోలో విటమిన్లు C, E, K, B ఉంటాయి. ఈ విటమిన్లు అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. ఇది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తుంది. సగం అవకాడోలో 0.66 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ అవకాడో తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

# రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేస్తే..

## ఎన్ని అద్భుతమైన లాభాలు కలుగుతాయో తెలుసా..?



ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు. రోజూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేవారు. దీంతో వారికి చక్కని వ్యాయామం జరిగేది. దీని వల్ల వారు ఆరోగ్యంగా ఉండేవారు. వృద్ధాప్యం వచ్చినా శారీరక దారుఢ్యం ఉండేది. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులోనే అన్ని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం వ్యాయామం లేదా శారీరక శ్రమ లేకపోవడమే అని చెప్పవచ్చు. కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అయితే మనకు అనేక రకాల వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చాలా మంది తమకు సౌకర్యవంతంగా ఉండే వ్యాయామాలను చేస్తుంటారు. ఇక అలాంటి వ్యాయామాల్లో స్కిప్పింగ్ కూడా ఒకటి. దీన్నే రోప్ జంపింగ్ లేదా స్కిప్పింగ్ రోప్స్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాయామాన్ని చాలా మంది చేస్తుంటారు. అయితే దీన్ని రోజూ చేయడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి.

**గుండెకు చక్కని వ్యాయామం..**

స్కిప్పింగ్ ను రోజూ కనీసం 30 నిమిషాల పాటు చేస్తే ఎన్నో లాభాలు ఉంటాయని ఫిట్ నెస్ నిపుణులు చెబుతున్నారు. అయితే స్కిప్పింగ్ అసలు అలవాటు లేని వారు రోజుకు 30 నిమిషాలు చేయడం కష్టం అవుతుంది. కనుక ముందుగా 5 నిమిషాలతో ప్రారంభించాలి. క్రమంగా ఆ సమయాన్ని పెంచుతూ పోవాలి. దీని వల్ల రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేసే సామర్థ్యం వస్తుంది. ఇలా ఈ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. స్కిప్పింగ్ వల్ల గుండెకు చక్కని వ్యాయామం అవుతుంది. దీన్ని అత్యుత్తమ, ఖర్చు లేని కార్డియో వ్యాయామంగా చెప్పవచ్చు. దీని వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు రక్తం, ఆక్సిజన్ సరఫరా సక్రమంగా అవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**కొవ్వు కరుగుతుంది..**

స్కిప్పింగ్ వల్ల శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. కార్బన్ డయాక్సైడ్ సులభంగా బయటకు వెళ్లిపోతుంది. స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు చక్కని వ్యాయామం అవుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడలు, పిరుదులకు చక్కని వ్యాయామం అవుతుంది. దీంతో ఆయా భాగాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది. శరీరం సన్నగా నాజూగ్గా మారుతుంది. కండరాలు దృఢంగా మారి చక్కని దేహ దారుఢ్యం సొంతమవుతుంది. శరీరంలో శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. ఈ వ్యాయామం చేయడం వల్ల శరీరం లోని కొవ్వు సులభంగా కరిగిపోతుంది. రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేస్తే శరీరం సుమారుగా 300 క్యాలరీల వరకు శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు.

## కోల్‌కతాలో 70 అడుగుల మెస్సీ విగ్రహం

### వర్చువల్‌గా ఆవిష్కరించిన ఫుట్‌బాల్ దిగ్గజం



ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. శనివారం మెస్సి కోల్‌కతాకు చేరుకున్నాడు. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామి జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. మెస్సిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇదే సందర్భంలో కోల్‌కతాలో 70 అడుగుల మెస్సి విగ్రహావిష్కరణ జరిగింది. ఉదయం లేక్‌టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో కలిసి మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా అతడు అక్కడికి వెళ్లలేక పోయాడు. తన 70 అడుగుల భారీ విగ్రహంపై మెస్సీ ఎంతో సంతోషం వ్యక్తం చేసినట్లు పశ్చిమ బెంగాల్ మంత్రి, శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు సుజిత్ బోస్ తెలిపారు. ఈ 70 అడుగుల విగ్రహం ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచకప్ విజయానికి ఇది ప్రతీకగా నిలుస్తోంది. మేం మెస్సి మేనేజర్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఈ విగ్రహ నిర్మాణానికి మెస్సి యాజమాన్యం ముందు అనుమతి ఇచ్చింది. ఈ విగ్రహంపై మెస్సి ఎంతో సంతృప్తిగా ఉన్నాడు. ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. 70 అడుగుల ఎత్తుతో ఇంత భారీ మెస్సీ విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ నిర్మాణాన్ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశాం. కోల్‌కతాకు మెస్సీ వస్తుండటంతో అభిమానుల్లో అపూర్వమైన ఉత్సాహం నెలకొంది' మంత్రి సుజిత్ బోస్ అన్నారు.

## మ్యాచ్ అడకుండానే వెనుదిరిగిన మెస్సీ

### కోల్‌కతాలో అభిమానుల ఆగ్రహం

### కుర్చీలు విరగ్గొట్టి హంగామా

### క్షమాపణలు చెప్పిన మమతా బెనర్జీ





ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి భారత పర్యటన మొదలయ్యింది. మూడు రోజుల పాటు ఆయన ఇండియాలో పర్యటించనున్నారు. శనివారం కోల్‌కతాతో పాటు హైదరాబాద్‌లో ఆయన పర్యటించారు. ఈ ఉదయం కోల్‌కతాలో ఏర్పాటు చేసిన తన విగ్రహాన్ని వర్చువల్‌గా ఆవిష్కరించారు. అనంతరం సాల్ట్ లేక్ స్టేడియానికి ఆయన వెళ్లారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే ఆయన అక్కడ ఉన్నారు. ఆ వెంటనే అక్కడినుంచి వెళ్లిపోయారు. ఆయనను చూడ్డానికి వచ్చిన ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మ్యాచ్ ఆడతానని చెప్పి ఆడకుండా వెళ్లిపోయాడని ఫ్యాన్స్ తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేడియంలో కుర్చీలు విరగ్గగొట్టారు. విరగ్గొట్టిన కుర్చీలను సాల్ట్ లేక్ స్టేడియంలోని ట్రాక్‌పై పడేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక, ఈ సంఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. మెస్సికి క్షమాపణ చెప్పారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వాహణ లోపం గురించి తెలిసి షాక్‌కు గురయ్యాను. బాధ కూడా వేసింది. నేను స్టేడియానికి వస్తూ ఉన్నాను. లియోనల్ మెస్సి, స్పోర్ట్స్ లవర్స్, మెస్సి ఫ్యాన్స్‌కు క్షమాపణ చెబుతున్నాను. సంఘటనపై నేను ఎంక్వైరీ కమిటీ వేస్తున్నాను. కమిటీ ఈ సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటాము. మరో సారి స్పోర్ట్స్ లవర్స్‌కు నా హృదయ పూర్వక క్షమాపణలు చేబుతున్నాను' అని ఆమె అన్నారు. కాగా, మరికాసేపట్లో మెస్సి హైదరాబాద్ బయలుదేరుతారు. రాత్రి ఏడు గంటల సమయంలో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొంటారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మెస్సితో ఫుల్‌బాల్ ఆడనున్నారు.

## నేడు సౌతాఫ్రికాతో మూడో టీ20

### ధర్మశాల వేదికగా టఫ్ ఫైట్



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో రెండో టీ20లో ఓడిన టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. ధర్మశాల వేదికగా ఆదివారం జరిగే మూడో టీ20లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్, సౌతాఫ్రికా చెరొక మ్యాచ్ గెలిచాయి. దాంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. పేలవ బౌలింగ్, చెత్త బ్యాటింగ్‌తో రెండో టీ20లో ఓడిన టీమిండియా.. ఆ తప్పిదాలను సవరించుకొని మళ్లీ విజయాల బాట పట్టాలని భావిస్తుండగా.. అదే జోరును కొనసాగించి సిరీస్‌పై పట్టు సాధించాలనే యోచనలో ఆతిథ్య సౌతాఫ్రికా ఉంది. తొలి రెండు మ్యాచ్‌లు ఏకపక్షంగా ముగియడంతో మూడో టీ20 అయినా రసవత్తరంగా సాగుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. తొలి రెండు టీ20ల్లో దారుణంగా విఫలమైన టీమిండియా ఓపెనర్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గాయం నుంచి కోలుకొని ఈ సిరీస్‌తోనే రీఎంట్రీ ఇచ్చిన శుభ్‌మన్ గిల్ 4, 0 పరుగులతో తీవ్రంగా నిరాశపర్చాడు. గిల్ కోసం అసాధారణ ప్రదర్శన కనబర్చిన సంజూ శాంసన్‌ను టీమిండియా మేనేజ్‌మెంట్ పక్కనపెట్టింది. కానీ గిల్ మాత్రం ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. సంజూ తర్వాత 14 ఇన్నింగ్స్‌ల్లో ఓపెనింగ్ చేసిన గిల్ ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 47 పరుగులే అత్యధికం. ఈ గణంకాల నేపథ్యంలోనే గిల్‌ను తప్పించి సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా కొనసాగించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కానీ గిల్‌కు టీమిండియా మేనేజ్‌మెంట్ మరో అవకాశం ఇవ్వచ్చు. ఒకవేళ గిల్‌ను తప్పిస్తే మాత్రం సంజూ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ రెండు టీ20ల్లో నిరాశపర్చాడు. భారీ షాట్లతో విరుచుకుపడినా పెద్ద స్కోర్లు నమోదు చేయలేకపోయాడు. మూడో టీ20లో అతను చెలరేగాల్సి ఉంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పరిస్థితి మరి దారుణంగా తయారైంది. గతేడాదిగా అతను తీవ్రంగా తడబడుతున్నాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా అతను బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. నాలుగో స్థానంలో తిలక్ వర్మ పర్వాలేదనిపించాడు. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. అక్షర్ పటేల్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేదు. తొలి టీ20లో సత్తా చాటిన హార్దిక్ పాండ్యా.. రెండో మ్యాచ్‌లో నిరాశపర్చాడు. శివమ్ దూబే కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. జితేష్ శర్మ తన వంతు సహకారం అందిస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తి సత్తా చాటుతున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా పర్వాలేదనిపిస్తున్నా.. అర్ష్‌దీప్ సింగ్ నిలకడలేమి ప్రదర్శనతో జట్టు పరాజయానికి కారణమయ్యాడు. అతను మెరుగ్గా రాణించాల్సి ఉంది.

**భారత్ తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్/సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్

**భారత టీ20 టీమ్**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

## అభిషేక్ శర్మ కింగ్ కోహ్లిని బీట్ చేస్తాడా..?



భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారారు. సౌతాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టు తరఫున ఆడుతున్న ఈ యువ సంచలనం.. ఇప్పుడు ఏకంగా టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లి తొమ్మిదేళ్ల నాటి ఓ అరుదైన రికార్డును బద్దలు కొట్టేందుకు చేరువలో ఉన్నాడు. ఈ సిరీస్‌లోని మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో అదుతే ప్రదర్శన చేస్తే, ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం అభిషేక్ ముందుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా టీ20 సిరీస్‌లో ఆడుతున్న అభిషేక్ శర్మకు తొలి రెండు మ్యాచ్‌ల్లో మంచి ఆరంభాలు దక్కినా, వాటిని పెద్ద స్కోర్లుగా మలచలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లోనూ 17 పరుగుల చొప్పున మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. దీంతో జట్టుకు ఆశించిన శుభారంభం దక్కలేదు. అయినప్పటికీ, మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో అతడు అదరగొడితే, విరాట్ కోహ్లి 2016లో నెలకొల్పిన ఓ భారీ రికార్డును బద్దలు కొట్టే అవకాశం ఉంది. భారత మాజీ సారథి విరాట్ కోహ్లి 2016 క్యాలెండర్ సంవత్సరంలో అదుతే ఫామ్‌తో చెలరేగిపోయాడు. ఆ ఏడాది మొత్తం 31 టీ20 మ్యాచ్‌లు ఆడి ఏకంగా 1,614 పరుగులు సాధించి.. ఒక సంవత్సరంలో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత ఆటగాడిగా అప్పటికే రికార్డు సృష్టించాడు. ఈ రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. తాజా క్యాలెండర్ సంవత్సరం (2025)లో అభిషేక్ శర్మ అదుతేమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇప్పటివరకు 39 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఈ యువ ఓపెనర్ 1,533 పరుగులు సాధించాడు. ఇప్పటికే అతడు 2022లో సూర్యకుమార్ యాదవ్ (1503 పరుగులు) నెలకొల్పిన రికార్డును అధిగమించాడు. ఇప్పుడు అభిషేక్ దృష్టి మొత్తం విరాట్ కోహ్లి రికార్డు మీదే ఉంది. కోహ్లి రికార్డును అధిగమించాలంటే అభిషేక్ శర్మకు ఇంకా కేవలం 82 పరుగులు మాత్రమే అవసరం. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు ఉండగా, ఈ యువ బ్యాటర్ ఈ రికార్డును ఖచ్చితంగా బద్దలు కొట్టగలడని అభిమానులు ఆశిస్తున్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 1-1తో సమమైంది. మూడో టీ20 మ్యాచ్ డిసెంబర్ 14న ధర్మశాలలో జరగనుంది. ధర్మశాల మైదానంలో బౌండరీలు చిన్నగా ఉండటం, అలాగే తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు కూడా 187గా ఉండటం వల్ల బ్యాటర్లకు ఈ పిచ్ బాగా అనుకూలిస్తుంది. కాబట్టి, అభిషేక్ శర్మ ఈ మ్యాచ్‌లో మంచి స్కోరు చేసి రికార్డుకు చేరువయ్యే అవకాశం ఉంది. ఈ మ్యాచ్ సిరీస్‌కు కీలక మలుపుగా మారనుంది. అలాగే అభిషేక్ రికార్డుపై కూడా అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## గూగుల్ ట్రెండ్స్‌లో టాప్ లేపిన సూర్యవంశీ



2025లో క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మార్మోగిపోతోంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో మొదలైన వైభవ్ జోరు ప్రస్తుతం జరుగుతున్న అండర్ 19 ఆసియా కప్‌లోనూ కొనసాగుతోంది. ఈ ఏడాదిలో వైభవ్ ఆయా టోర్నీల్లో కలిపి ఇప్పటిదాకా నాలుగు సెంచరీలు బాది ఔరా అనిపించాడు. ఈ క్రమంలో మరో అరుదైన ఘనత సాధించాడు. ఈ ఏడాది గూగుల్?లో అత్యధిక మంది సెర్చ్ చేసిన వ్యక్తుల పేర్లలో వైభవ్ సూర్యవంశీ టాప్ ప్లేస్ దక్కించుకున్నాడు. గత ఏడేనిమిది నెలలుగా క్రికెట్‌లో రాణిస్తుండడంతో ఈ యువ సంచలనం పేరు మార్మోగిపోతోంది. ఈ క్రమంలో గూగుల్‌లో అతడి గురించి సెర్చ్ చేసేవారి సంఖ్య కూడా అమాంతం పెరిగిపోయింది. దీంతో 2025 గూగుల్ సెర్చ్ ట్రెండ్స్‌లో భారత్‌లో అత్యధిక మంది సెర్చ్ చేసిన క్రికెటర్‌గా రికార్డ్ కొట్టాడు. కాగా, ఈ జాబితాలో ప్రియాంశ్ ఆర్య రెండో ప్లేస్‌లో ఉండగా, టీమ్‌ఇండియా యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇటీవల ముగిసిన మహిళల వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో అదుతే శతకంతో భారత్‌ను గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్ పేరు ఐదో ప్లేస్‌లో ఉంది. అయితే స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కంటే వైభవ్ గురించే ఎక్కువ మంది శోధించడం ఇక్కడ మరో విశేషం. ఈ ఇద్దరు లెజెండ్స్ టాప్ 10లో కూడా లేరు. ప్రస్తుతం వైభవ్ అండర్ 19 ఆసియా కప్?లో ఆడుతున్నాడు. శుక్రవారం భారత్-యూఏఈ మ్యాచ్‌లో వైభవ్ 171 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే ఈ మ్యాచ్ అనంతరం గూగుల్ ట్రెండ్స్ గురించి అతడు స్పందించాడు. ఇలాంటి వాటిపై తాను పెద్దగా దృష్టి పెట్టనని అన్నాడు. "ఇలాంటి వాటిపై నేను దృష్టి పెట్టను. నా ఆటపైనే దృష్టి పెడతాను. దీని గురించి నేను విన్నాను. ఇవి బాగానే అనిపిస్తాయి. కానీ ఎక్కువగా వీటి గురించి ఆలోచించను. త్వరగా మూవ్ ఆన్ అయిపోతాను" అని మ్యాచ్ తర్వాత జరిగిన వైభవ్ అన్నాడు. కాగా, ఆసియా కప్ అండర్ 19లో యూఏఈపై తాజా మ్యాచ్‌లో చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. 95 బంతుల్లోనే 171 పరుగులు నమోదు చేశాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిన అతడు 55 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా 95 బంతుల్లో 171 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్స్‌లు, 9 ఫోర్లు బాదడం విశేషం. ఇక ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ సెంచరీ నమోదు చేశాడు. ఈ క్రమంలోనే సయ్యద్ ముస్తాక్‌లో శతకం సాధించిన అతి పిన్న వయస్కుడి (14ఏళ్లు)గా రికార్డు సృష్టించాడు.

# కలెక్షన్స్‌లో బాలయ్య అఖండ తాండవం



నందమూరి బాలయ్య నటించిన 'అఖండ 2' థియేటర్లలో మాస్ తుఫాను సృష్టిస్తోంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్లతో ప్రారంభమై తొలి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. బాలయ్య నట విశ్వరూపం, హై వోల్టేజ్ యాక్షన్, ఆధ్యాత్మిక ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ షోస్ హౌస్‌ఫుల్‌గా నడుస్తున్నాయి. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.65 నుంచి రూ.80 కోట్ల వరకు గ్రాస్ వసూలు చేసే అవకాశం ఉంది. ఇదే జోరు కొనసాగితే మొదటి వారంలోనే రూ.150 కోట్ల గ్రాస్ దాటే ఛాన్స్ ఉందని టాలీవుడ్‌లో చర్చ సాగుతోంది.బోయపాటి శ్రీను దర్శకత్వంలో నందమూరి బాలయ్య హీరోగా తెరకెక్కిన ' అఖండ 2 ' థియేటర్లలో భారీ రెస్పాన్స్‌తో దూసుకుపోతోంది. డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్లతో ప్రారంభమైన ఈ సినిమా విడుదలైన తొలి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. మాస్, యాక్షన్, ఆధ్యాత్మిక అంశాలు కలగలిసిన కథనం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా బాలయ్య నట విశ్వరూపం, శివతాండవాన్ని తలపించే హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. థియేటర్ల వద్ద భారీ రష్, హౌస్‌ఫుల్ బోర్డులు, ఫ్యాన్స్ సంబరాలు అన్నీ కలిసి 'అఖండ 2' ఆగమనాన్ని గ్రాండ్‌గా మార్చేశాయి. పెద్ద సినిమాలు ప్రస్తుతం థియేటర్లలో లేకపోవడం కూడా ఈ సినిమాకు కలిసొచ్చిందనే అభిప్రాయం వినిపిస్తోంది.సినిమాకు వచ్చిన పాజిటివ్ టాక్ ప్రభావం కలెక్షన్లపై స్పష్టంగా కనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలోనూ షోస్ ఫుల్ అవుతున్నాయని సమాచారం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ట్రేడ్ అంచనాల ప్రకారం, బుక్ మై షోలో గంటకు సుమారు 10-15 వేల టికెట్లు బుక్ అవుతున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రపంచవ్యాప్తంగా 'అఖండ 2' తొలి రోజు గ్రాస్ కలెక్షన్స్ రూ.65 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ఉండొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రీమియర్స్ నుంచే ఈ స్థాయిలో బుకింగ్స్ రావడం బాలయ్య కెరీర్‌లో అరుదైన విషయమనే చెప్పాలి. మరోవైపు సాక్నిల్క్ వెబ్‌సైట్ ప్రచారం.. ప్రీమియర్స్‌తో కలిపి ఫస్ట్ డే తెలుగులో రూ.30.75 కోట్లు, కరా?టకలో రూ.3.77 కోట్లు, తమిళనాడులో రూ.1.13 కోట్లు, కేరళలో రూ.3లక్షలు, ఎన్నో ఆశలు పెట్టుకున్నరెస్టాఫ్ ఇండియాలో కేవలం రూ.5 లక్షలు మాత్రమే వసూలు చేసింది. ఓవరాల్‌గా చూసుకుంటే 'అఖండ 2' సినిమా ఫస్ట్ డే ఇండియాలో రూ.36.18 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఈ కలెక్షన్ల విషయమై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన ర్షావాల్సి ఉంది. 2021లో విడుదలైన 'అఖండ' కూడా కరోనా పరిస్థితుల్లోనే భారీ ఓపెనింగ్ సాధించింది. ఆ సినిమా అప్పట్లో తొలి రోజు సుమారు రూ.30 కోట్ల గ్రాస్ వసూలు చేసి సత్తా చాటింది. ఇప్పుడు సీక్వెల్‌గా వచ్చిన 'అఖండ 2' మాత్రం ఆ మార్క్‌ను చాలా రెట్లు దాటే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులు సినిమాను విపరీతంగా ఆదరిస్తుండటంతో వీకెండ్ నాటికి కలెక్షన్స్ మరింత ఊపందుకుంటాయని అంచనా. ట్రేడ్ విశ్లేషకుల మాట ప్రకారం, ఇదే జోరు కొనసాగితే మొదటి వారంలోనే 'అఖండ 2' దాదాపు రూ.150 కోట్ల వరకు గ్రాస్ వసూలు చేసే ఛాన్స్ ఉంది. బాలయ్య--బోయపాటి కాంబినేషన్‌కు ఉన్న నమ్మకం, అభిమానుల్లో ఉన్న ఉత్సాహం, సోషల్ మీడియాలో నడుస్తున్న పాజిటివ్ ప్రచారం ఇవన్నీ కలసి కలెక్షన్లను మరింత పెంచేలా కనిపిస్తున్నాయి. లాజిక్స్ కంటే ఎలివేషన్, మాస్ ఎమోషన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన బోయపాటి టేకింగ్ బాలయ్య ఫ్యాన్స్‌ను ఫుల్‌గా అలరిస్తోంది.



## ఆ హీరోయిన్‌కు ఎప్పుడు కలిసొస్తుందో?

మనమెంత కష్టపడినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా దైవానుగ్రహం, కొద్దిపాటి అదృష్టం కూడా ఉంటేనే జీవితంలో అన్నీ అనుకున్నట్టు జరుగుతాయి. ఆ అదృష్టమే లేకపోతే ప్రతీదీ ఆఖరి వరకు వచ్చి రిజల్ట్ తేలే సమయానికి ఆగిపోతుంది. ఇప్పుడు సౌత్ హీరోయిన్ కృతి శెట్టి పరిస్థితి కూడా అలానే ఉంది. ఉప్పెన అనే తెలుగు సినిమాతో కృతి ఇండస్ట్రీకి పరిచయమైన సంగతి తెలిసిందే. మొదటి సినిమానే మంచి బ్లాక్ బస్టర్ గా నిలవడం, దానికి తోడు ఆ సినిమాలో తన నటనకు కృతికి మంచి పేరు రావడంతో టాలీవుడ్ లోకి మరో స్టార్ హీరోయిన్ వచ్చేసిందని అంతా అనుకున్నారు. దానికి తగ్గట్టే ఉప్పెన తర్వాత కృతికి అవకాశాలు కూడా క్యూ కట్టాయి. కానీ అవేవీ కృతికి స్టార్ డమ్ ను తెచ్చిపెట్టలేకపోయాయి. మరీ ముఖ్యంగా కృతి నుంచి తెలుగులో ఆఖరిగా వచ్చిన సినిమాలైతే దారుణమైన ఫలితాల్ని అందుకున్నాయి. ఉప్పెన తర్వాత కృతి చేసిన బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్ తప్ప మిగిలిన సినిమాలైన మనమే, కస్టడీ, ది వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి సినిమాలైతే అమ్మడికి నిరాశనే మిగిల్చాయి. దీంతో క్రమంగా కృతికి తెలుగులో అవకాశాలు కూడా తగ్గాయి. ఇక చేసేదేమీ లేక కోలీవుడ్ లో లక్ ను టెస్ట్ చేసుకుందామని తమిళంకు వెళ్లి అక్కడ ప్రయత్నాలు చేసింది కానీ అది కూడా అమ్మడికి ఏ మాత్రం కలిసి రావడం లేదు. ఎంతో కష్టపడి అవకాశాలను అందుకుని, సినిమాలను పూర్తి చేసి సినిమాల ప్రమోషన్స్ వరకు అయితే చేయగలిగింది కానీ అవి ఆఖరి నిమిషంలో రిలీజ్ వాయిదా పడటంతో మరోసారి కృతికి నిరాశ తప్పడం లేదు. కార్తీతో చేసిన అన్నగారు వస్తారు మూవీపై ఎన్నో హోప్స్ పెట్టుకుని ఆ మూవీని ఎంతగానో ప్రమోట్ చేస్తే లాస్ట్ మినిట్ లో అది వాయిదా పడింది. డిసెంబర్ 12న రిలీజ్ కావాల్సిన సినిమా ఫిబ్రవరి అంటున్నారు కానీ అది కూడా కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఇక డిసెంబర్ 18న రిలీజ్ కావాల్సిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా వాయిదా పడుతున్నట్టు వార్తలొచ్చాయి. డైరెక్టర్ విఘ్నేష్ శివన్, నిర్మాతకు వచ్చిన విభేదాలే దీనికి కారణమని టాక్. దీంతో ఈ సినిమా కూడా వాయిదా పడింది. ఇక మరో సినిమా జీనీ కూడా ఎప్పుడో మొదలైంది కానీ ఇంకా రిలీజవలేదు. దాని గురించి ఎలాంటి అప్డేట్ లేదు. తెలుగులో ఆఫర్లు రావడం లేదని కోలీవుడ్ కు వచ్చి ఎప్పుడెప్పుడు సక్సెస్ అందుకుందామా అని కృతి చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికప్పుడు వాయిదా పడుతున్నాయే తప్పించి అమ్మడిని సక్సెస్ కు చేరువ మాత్రం చేయలేకపోతున్నాయి. మరి కృతిని తను కోరుకుంటున్న సక్సెస్ ఎప్పుడు వరిస్తుందో చూడాలి.




## ఓటీటీలోకి రాజు వెడ్స్ రాంబాయి..

తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఇల్లెందులో జరిగిన ఓ యదార్ధ సంఘటన ఆధారంగా తెరకెక్కిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. కొత్త డైరెక్టర్ సాయిలు కంపాటి తెరకెక్కించిన ఈ ప్రేమ కథా చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో, హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరికీ ఇదే మొదటి సినిమా కావడం గమనార్హం. అయినా తమ అద్భుత నటనతో ఆడియెన్స్ తో కన్నీళ్లు పెట్టించారు. ఇక సిద్దు జొన్నలగడ్డ సోదరుడు చైతన్య జొన్నలగడ్డ విలన్ పాత్రలో బాగా భయపెట్టాడు. ఈ సినిమాలో అతని నటనే హైలెట్ అని చెప్పుకోవచ్చు. నవంబర్ 21న విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి సినిమా మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి కలెక్షన్లు రాబట్టింది చాలా తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ రూరల్ లవ్ స్టోరీ రూ.17 కోట్ల కు పైగా కలెక్షన్లు రాబట్టింది. థియేటర్లలో సూపర్ హిట్ గా నిలిచిన ఈ సినిమాను ఓటీటీలో చూడాలని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే వీరి నిరీక్షణకు తెరపడనుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 19 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోషల్ మీడియాలో రాజు వెడ్స్ రాంబాయి ఓటీటీ స్ట్రీమింగ్ పోస్టులు దర్శనమిస్తున్నాయి. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వెలువడవచ్చు.డా. నాగేశ్వర్ పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్, డోలాముఖి సబాల్టర్న్ ఫిల్మ్స్, మాన్సూన్ టేల్స్ బ్యానర్లపై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాస్ఈ మూవీని డిస్ట్రిబ్యూట్ చేశారు. శివాజీ రాజా, అనిత చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.

## స్టైలిష్ లుక్‌లో వెంకీ

టాలీవుడ్ సీనియర్ హీరో, విక్టరీ వెంకటేష్.. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో ఓ క్యామియో చేస్తున్న సంగతి తెలిసిందే. ఇవాళ వెంకటేష్ బర్త్ డే సందర్భేగా మేకర్స్ ఓ చిన్న గ్లింప్స్ ద్వారా ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేస్తూ వెంకీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ లుక్ లో వెంకీ చాలా స్టైలిష్ గా, రాయల్ గా కనిపిస్తున్నారు. హెలికాప్టర్ ముందు చుట్టూ బాడీ గార్డ్స్ తో వెంకీ చాలా హుందాగా కనిపిస్తున్నారు. వెంకటేష్ బర్త్ డే సందర్భేగా తన ఫ్రెండ్, టాలీవుడ్ సీనియర్ హీరో, మెగాస్టార్ చిరంజీవి కూడా ఆయనకు బర్త్ డే విషెస్ ను తెలుపుతూ పోస్ట్ చేశారు. నువ్వెక్కడున్నా నీ ప్రెజెన్స్ తో అక్కడ పాజిటివ్ వాతావరణాన్ని క్రియేట్ చేస్తావు, నీతో కలిసి చేసిన మన శంకరవరప్రసాద్ గారు షూటింగ్ లో ప్రతీ క్షణాన్నీ జీవితాంతం గుర్తుంచుకుంటాను, నీకు ఈ ఇయర్ అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా అని రాస్తూ సినిమాలో ఇద్దరూ కలిసి ఉన్న ఓ ఫోటోను షేర్ చేశారు చిరంజీవి.



## ఆరు దేశాలలో 'ధురంధర్' సినిమాపై నిషేధం

రణ్ వీర్ సింగ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ధురంధర్. యురి ఫేమ్ ఆదిత్య ధార్ తెరకెక్కించిన ఈ సినిమాలో సారా అర్జున్ కథానాయికగా నటించింది. అలాగే అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, మాధవన్ తదితర స్టారాది స్టార్స్ నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ఈ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'ధురంధర్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతున్న ఈ మూవీ గురించి ఒక షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ సూపర్ హిట్ సినిమాపై నిషేధం విధించారు. ఒకటి కాదు, రెండు కాదు, ఆరు దేశాలు ఈ సినిమాను నిషేధించాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఈ నిషేధాన్ని విధించాయి. స్పై థ్రిల్లర్ గా తెరకెక్కిన ధురంధర్ మూవీలో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా సన్నివేశాలు ఉండడంతో ఇస్లామిక్ దేశాలు ఈ సంచలన నిర?యాన్ని తీసుకున్నాయి. గతంలో, 'స్కై ఫోర్స్', 'ఫైటర్', 'ఆర్టికల్ 370', 'టైగర్ 3' సినిమాలను కూడ ఈ దేశాలలో నిషేధించారు. అయితే ధురంధర్ చిత్ర బృందం తమకు ఆసమస్య రాకుండా శాయశక్తులా ప్రయత్నించింది. కానీ అది సాధ్యం కాలేదు. సెన్సార్ బోర్డు ఈ సినిమా రిలీజ్ కు అంగీకరించలేదు. ఈ సినిమా డిసెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుండి, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లు, భారతదేశంలో రూ. 200 కోట్లు వసూలు చేసింది. ఈ వారాంతంలో ఈ సినిమా మరిన్ని వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది. కాగా చాలా సంవత్సరాల తర్వాత ఈ సినిమాతో రణ్‌వీర్ సింగ్ హిట్ కొట్టాడు. ఈ సినిమా అతని కెరీర్‌కు మంచి మైలేజ్ ఇచ్చింది. వివాదాలు ఉన్నప్పటికీ, సినిమాకు భారీ కలెక్షన్లు సాధిస్తున్నాయి. అయితే ఇప్పుడు నిషేధం కూడా సినిమా కలెక్షన్లపై పెద్దగా ప్రభావం చూపదని తెలుస్తోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463